మనసున్న మారాజు సీఎం జగన్



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు



కొత్త లబ్ధిదారులకు పింఛన్లు అందిస్తున్న కె.కె.రాజు

- ఇచ్చిన మాట ప్రకారం పింఛన్ పెంపు
- వైఎస్సార్‌సీపీ 'ఉత్తర' సమన్వయకర్త కె.కె.రాజు
- 458 మందికి కొత్త పెన్షన్ల పంపిణీ

మద్దిపాలెం: ఇచ్చిన మాట ప్రకారం సంక్షేమ పథకాలు అమలు చేస్తూ మంచి మనసున్న మారాజుగా అందరి హృదయాల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నిలిచిపోయారని నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు అన్నారు. నియోజకవర్గంలోని 47, 48, 49, 50, 51, 53, 54 వార్డులకు సంబంధించి అర్హులైన 458 మందికి కొత్త పెన్షన్లను శుక్రవారం పంపిణీ చేశారు. 51వ వార్డు మాధవధారలోని మాధవ స్వామి కల్యాణ మండపంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆయన పింఛన్లు అందజేశారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ ఉత్తర నియోజకవర్గంలో కొత్తగా 1,000 మందికి పైగా లబ్ధిదారులకు పింఛన్లు మంజూరయ్యాయని తెలిపారు. గతంలో టీడీపీ ప్రభుత్వం రాష్ట్ర ప్రజలను పట్టించుకోకుండా కేవలం స్వలాభం కోసం అధికారాన్ని దుర్వినియోగం చేసిందన్నారు. అలాంటి క్లిష్ట పరిస్థితుల్లో ప్రజలతో మమేకమై వారి కష్టాలను తెలుసుకోవాలనే ఉద్దేశంతో సీఎం వైఎస్ జగన్ ప్రజాసంకల్ప యాత్ర చేసి 'నేను విన్నాను.. నేను ఉన్నాను' అని ధైర్యం చెప్పి అధికారంలోకి వచ్చాక పేదలందరికీ అండగా నిలిచారని చెప్పారు. చెప్పిన దానికంటే మిన్నగా, చెప్పిన సమయం కంటే ముందుగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు.

సీఎంను దీవించండి..

ఆనాడు ప్రజాసంకల్ప యాత్రలో అవ్వాతాతల కష్టాలను గుర్తించి వారి పెన్షన్ దఫదఫాలుగా రూ.3 వేలు ఇస్తానని మాటిచ్చి.. దాని ప్రకారం ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే మొదటి సంతకం పింఛన్ పథకంపై పెట్టారని కె.కె.రాజు గుర్తుచేశారు. అందరి దీవెనలు, మద్దతు ముఖ్యమంత్రి జగన్‌పై ఉండాలని ప్రజలను ఆయన కోరారు. 51వ వార్డు కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ అధ్యక్షత వహించిన కార్యక్రమంలో జీవీఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్ అల్లు శంకరరావు, కార్పొరేటర్లు కంటిపాము కామేశ్వరి, వావిలపల్లి ప్రసాద్, చల్లా రజని, పార్టీ సీనియర్ మహిళా నాయకురాలు పేడాడ రమణికుమారి, ఏపీడీ పద్మావతి, వార్డు అధ్యక్షులు నీలి రవి, గుజ్జు వెంకటరెడ్డి, మాజీ కార్పొరేటర్ వెంగలరావు, సీనియర్ నాయకులు, రాష్ట్ర డైరెక్టర్లు, అనుబంధ సంఘాల అధ్యక్షులు, సభ్యులు, సచివాలయ కన్వీనర్లు, కార్యకర్తలు, సీవోలు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

అన్ని పథకాలు అందుతున్నాయి



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రజలందరికీ అన్ని పథకాలు అందుతున్నాయి. నాకు కొత్తగా పింఛన్ రావడం చాలా సంతోషంగా ఉంది. నా కుటుంబానికి ఆర్థిక భరోసా లభించింది. ఎటువంటి సమస్యలు లేవు. ఒక వేళ ఉన్నా వెంటనే పరిష్కరిస్తున్నారు.

– జి.సీతారత్నం, రామన్న కాలనీ, 51వ వార్డు

ఊపిరున్నంత వరకు వైఎస్సార్‌సీపీకే నా ఓటు



నేను గతంలో ఎన్టీఆర్ అభిమానిని. టీడీపీకే మద్దతుగా ఉండేవాడిని. కానీ టీడీపీ ప్రభుత్వ హయాంలో నాకు ఎటువంటి లబ్ధి చేకూరలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక నా భార్యకి వైఎస్సార్ చేయూత, నాకు వృద్ధాప్య పింఛన్, నా మనమడికి అమ్మ ఒడి పథకం వస్తున్నాయి. మేము లబ్ధి పొందాం, మా ఊపిరి ఉన్నంత వరకు మా అందరి ఓట్లు సీఎం వైఎస్ జగన్‌కే వేస్తాం.

– ఎం.సత్యనారాయణ, మురళీనగర్, 50వ వార్డు

రైల్వే హాస్పిటల్‌లో తొలి సారి..

సాధారణ ప్రసవం ద్వారా కవలల జననం



కవల శిశువులతో తండ్రి అశోక్‌కుమార్, రైల్వే ఆస్పత్రి వైద్య బృందం



డాక్టర్లు భాషిణి ప్రియాంక, శివకుమార్‌ను అభినందిస్తున్న డీఆర్‌ఎం అనూప్‌కుమార్ సత్పతి

తాటిచెట్లపాలెం: దొండపర్తిలోని డివిజనల్ రైల్వే హాస్పిటల్‌లో శుక్రవారం సాధారణ ప్రసవం ద్వారా తొలి కవల పిల్లలు జన్మించారు. వివరాలిలా.. వాల్తేర్ డివిజన్ క్యారేజ్ అండ్ వేగన్ విభాగ ఉద్యోగి ఎం.అశోక్‌కుమార్ సతీమణి ఎం.హైమావతికి ప్రసవ సమయం కావడంతో రైల్వే ఆస్పత్రిలో చేరి్పించారు. అసిస్టెంట్ డివిజనల్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ భాషిణి ప్రియాంక, డివిజనల్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వి.ఆర్.శివకుమార్ దుద్దుల నేతృత్వంలో వైద్య బృందం హైమావతికి సాధారణ ప్రసవం చేసేందుకు సిద్ధం చేశారు. వైద్యుల పర్యవేక్షణలో శుక్రవారం ఆమె కవల మగ పిల్లలకు జన్మనిచ్చింది. మొదటి బిడ్డ 2.76 కేజీలు, మరో గంట తరువాత జన్మించిన రెండో బిడ్డ 2.66 కేజీల బరువుతో సాధారణ ప్రసవం ద్వారా పుట్టినట్లు హాస్పిటల్ వర్గాలు తెలిపాయి.

వైద్య బృందానికి డీఆర్‌ఎం అభినందనలు

రైల్వే ఆస్పత్రిలో 2019లో డాక్టర్ భాషిణి ప్రియాంక గైనకాలజిస్ట్‌గా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి నేటి వరకు ఆమె నేతృత్వంలో సుమారు 175 సాధారణ డెలివరీలు చేశారు. క్లిష్ట పరిస్థితుల్లో అసాధారణ కేసులను మాత్రమే ఆమె సిజేరియన్‌ను చేయించే వారని హాస్పిటల్ వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం రైల్వే హాస్పిటల్ ఎటువంటి కేసులనైనా చేధించగలిగే స్థాయికి చేరుకుంది. ఈ ప్రక్రియలో ప్రిన్సిపల్ చీఫ్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ సి.కె.వెంకటేశ్వర్లు, చీఫ్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఆర్.కె.తిరుఅరుల్ జోతి, అడిషనల్ చీఫ్ మెడికల్ సూపరింటెండెంట్(అడ్మిన్) డాక్టర్ కె.పి.ఎస్.కాశీపతి, డాక్టర్ మహేష్‌కుమార్ అడిషనల్ చీఫ్ మెడికల్ సూపరింటెండెంట్(అనస్థిటిస్ట్), ఆపరేషన్ థియేటర్ సిబ్బంది, సుశిక్షితులైన లేబర్ రూం టీం భాగస్తులయ్యారు. ఈ అరుదైన ఘనత సాధించిన వైద్య బృందాన్ని డీఆర్‌ఎం అనూప్‌కుమార్ సత్పతి ప్రత్యేకంగా అభినందించారు.

సంక్షేమం.. అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం



సంక్షేమ పథకాల కరపత్రం అందిస్తున్న కె.కె.రాజు, కార్పొరేటర్ అల్లు శంకరరావు

మద్దిపాలెం: ప్రజా సంక్షేమం, రాష్ట్రాభివృద్ధే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పని చేస్తోందని నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు అన్నారు. 49వ వార్డు మురళీనగర్–5, 283 సచివాలయం బర్మాక్యాంప్ ఎల్‌బీ నగర్, గిరిజ నగర్ ప్రాంతాల్లో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. జీవీఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్ అల్లు శంకరరావుతో కలిసి ఆయన పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తూ ప్రజల సమస్యలను నేరుగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ గతంలో నాయకులు కేవలం స్వార్థం కోసమే రాజకీయాలు చేసే వారని.. నేడు మన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సంపూర్ణ మనసుతో ప్రజలకు మంచిచేయాలనే దృఢ సంకల్పంతో ఆయనకున్న సమయాన్ని మొత్తం ప్రజా సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి కోసం వెచ్చిస్తున్నారన్నారు. అవినీతి రహిత పాలనను ప్రజలకు చేరువ చేయాలనే ఉద్దేశంతో జగనన్న అనేక పథకాలు అమలు చేస్తూ, వాటిపై నిరంతరం పర్యవేక్షణ ఉండాలనే ఉద్దేశంతో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి రూపకల్పన చేశారని చెప్పారు. కార్యక్రమంలో డైరెక్టర్లు ఎస్.రవికుమార్, ఐ.రవికుమార్, రాయుడు శ్రీను, దిడ్డి రమేష్, 49వ వార్డు నాయకులు ఢిల్లీరావు, ఆదిరెడ్డి శ్రీను, చంద్రశేఖర్, రామకృష్ణ, బి.శంకర్, పావని, ప్రశాంత్, నాగరాజు, శివరాంప్రసాద్, చైతన్య, ప్రసాద్, సీనియర్ నాయకులు అంబటి శైలేష్, నాయకులు కర్రి రామారెడ్డి, వసంతల అప్పారావు, షేక్ బాబ్జి, కె.చిన్నా, వెంకటేష్, రాము, జీవీఎంసీ అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

క్లుప్తంగా

48వ వార్డు సమస్యలపై మేయర్‌కు వినతి



మేయర్ హరివెంకటకుమారికి వినతిపత్రం అందిస్తున్న కార్పొరేటర్ గంకల కవిత

కంచరపాలెం: జీవీఎంసీ 48వ వార్డులోని పలు ప్రాంతాల ప్రధాన సమస్యలపై మేయర్ గొలగాని హరివెంకటకుమారికి శుక్రవారం జీవీఎంసీ కార్యాలయంలో కార్పొరేటర్ గంకల కవిత వినతిపత్రం అందజేశారు. కంచరపాలెం ఇందిరానగర్, ఏఎస్సార్ కాలనీ, జవహర్‌లాల్ నగర్, రాంజీ ఎస్టేట్, బాపూజీ నగర్, రామకృష్ణ నగర్, నీలకంఠ నగర్ తదితర కొండవాలు ప్రాంతాల్లో పర్యటించి సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేయాలని ఆమెను కోరారు. సుమారు 32 పేజీలతో కూడిన వినతిపత్రాన్ని మేయర్‌కు అందించినట్లు ఆ వార్డు సీనియర్ నాయకుడు గంకల అప్పారావు తెలిపారు.

బౌద్ధాలయంలో పౌర్ణమి పూజలు



పేద మహిళలకు చీరలు అందిస్తున్న అతిథులు

కంచరపాలెం: స్థానిక అశోక్‌నగర్‌లోని బౌద్ధాలయంలో ఆంధ్ర బౌద్ధ కేంద్ర సమాజం ప్రధాన కార్యదర్శి కె.రాజుగణేష్ ఆధ్వర్యంలో శుక్రవారం పౌర్ణమి పూజలు ఘనంగా నిర్వహించారు. బుద్ధుడి విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించారు. ఈ సందర్భంగా అతిథుల చేతుల మీదుగా పేద మహిళలకు చీరల పంపిణీ, అన్నదానం చేశారు. అనంతరం ఉచిత కంప్యూటర్ శిక్షణ తరగతులను రాజుగణేష్ పర్యవేక్షించారు. కార్యక్రమంలో సిహెచ్.బాబురావు, రాజు, భీమారావు, సూరిబాబు, రాము, రామచంద్రరావు, పరిమళ, సునీల్, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

అలరించిన వయోలిన్ కచేరీ



కచేరీ చేస్తున్న మూర్తి

సీతంపేట: కంచి కామకోటి పీఠాధిపతి శ్రీశంకర విజయేంద్ర సరస్వతి ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక శంకరమఠంలో మహాత్రిపుర సుందరి సమేత చంద్రమౌళీశ్వర స్వామికి ఏకాదశ రుద్రాభిషేకం, విశేష అర్చన, రుద్ర హోమం, చండీ హోమం నిర్వహించారు. మిజోరాం గవర్నర్ కంభంపాటి హరిబాబు సాయంత్రం స్వామీజీని కలిసి ఆశీస్సులు అందుకున్నారు. ఎం.ఎస్.ఎన్.మూర్తి వయోలిన్ కచేరీ అలరించింది. కార్యక్రమంలో శంకరమఠం అధ్యక్షుడు టి.రవిరాజు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం



మల్లారెడ్డి గోపాలరావు

మద్దిపాలెం: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక వ్యక్తి అదృశ్యమైన ఘటన జరిగింది. అతడి భార్య ఫిర్యాదు మేరకు శుక్రవారం పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలిలా.. కంచరపాలెం గౌరీనగర్‌లో నివాసముంటున్న మల్లారెడ్డి గోపాలరావు ఫైనాన్స్ కలెక్షన్ చేస్తుంటాడు. రోజూ మాదిరిగానే గురువారం సాయంత్రం విధులకు వెళ్లి తిరిగి రాత్రి ఇంటికి రాకపోవడంతో అతడి భార్య మల్లారెడ్డి దేవి కంచరపాలెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. 5.3 అడుగుల ఎత్తు, ఇంటి నుంచి తెల్లచొక్కా మీద చెక్స్, గోధుమ రంగు ఫ్యాంట్ ధరించాడు. కంచరపాలెం సీఐ విజయ్‌కుమార్ నేతృత్వంలో ఏఎస్ఐ ఆదిరాజు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భారతీయ సంప్రదాయాలంటే ఇష్టం

బాలభాను పాఠశాల సందర్శనలో విదేశీయులు



బాలభాను పాఠశాలలో విదేశీయుల సందడి

మురళీనగర్: భారతీయ సంస్కృతీ సంప్రదాయాలంటే తమకెంతో ఇష్టమని విదేశీయులు అన్నారు. గురుపూజోత్సవాల సందర్భంగా శుక్రవారం మురళీనగర్ బాలభాను పాఠశాలలో ఈస్ట్ వెస్ట్ బ్రదర్ హుడ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జర్మనీ, ఆస్ట్రేలియా, స్పెయిన్, జర్మనీ, అర్జెంటీనా దేశాలకు చెందిన 40 మంది విశాఖ పర్యటనలో భాగంగా ఈ స్కూల్‌ను సందర్శించారు. ఇక్కడ అమలు చేస్తున్న విద్యా బోధనా విధానం, విద్యార్థుల క్రమశిక్షణ, వారు అనుసరిస్తున్న సంప్రదాయ పద్ధతులు, ఆచార వ్యవహారాలను వీరు దగ్గరుండి పరిశీలించారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు ఆచరణీయమైనవన్నారు. విదేశీ వనితలు తెలుగు సంప్రదాయ దుస్తులు, చీరలు ధరించి సందడి చేశారు. ఆస్ట్రేలియా నుంచి రోసీ డియాజ్ డ్యూక్ గ్రూప్, జర్మనీ నుంచి రాబర్ట్ బడియా గ్రూప్, స్పెయిన్ నుంచి లూడ్జర్ ఫిలిప్స్ గ్రూప్ సభ్యులు, అర్జెంటీనా కంట్రీ గ్రూప్ నుంచి ఆల్‌బెర్ట్ బెలిజి, క్రిస్టియానా యూఎస్‌ఏ గ్రూప్ నుంచి మిక్వాల్, రోజా సగ్రోసా తదితరులు పాఠశాలను సందర్శించారు. కార్యక్రమంలో జగద్గురు పీఠం కార్యదర్శి, బాలభాను విద్యాలయం కరస్పాండెంట్ రామకృష్ణరాజు, ప్రిన్సిపాల్ శుభశ్రీ, వైస్ ప్రిన్సిపాల్ టి.మనోరమణి, వ్యాయామ ఉపాధ్యాయుడు సిహెచ్.రమణరావు పాల్గొన్నారు.

మదర్ ఇండియా ట్రస్టుకు కలెక్టర్ అభినందన



కలెక్టర్ మల్లికార్జునను సత్కరిస్తున్న ట్రస్టు ప్రతినిధులు

సీతంపేట: మదర్ ఇండియా వెల్ఫేర్ ట్రస్టు అధ్యక్షుడు మళ్ల వెంకటరావు, గౌరవాధ్యక్షుడు బండే వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి కందాల ప్రభాకర్, కోశాధికారి సిహెచ్.మహేశ్వరరావులు శుక్రవారం కలెక్టర్ ఎ.మల్లికార్జునను కలిసి మూడేళ్లుగా ట్రస్టు చేపడుతున్న సేవా కార్యక్రమాలను వివరించారు. వాటిపై సంస్థ రూపొందించిన బ్రోచర్ చూపించారు. బ్రోచర్‌లో ముద్రించడానికి ట్రస్టును ఉద్దేశించి మెసేజ్ ఇవ్వాలని కలెక్టర్‌ను వారు కోరారు. దీనికి సానుకూలంగా స్పందించిన కలెక్టర్ ట్రస్టు గురించి వివరాలు తెలుసుకున్నారు. నిస్వార్థంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న ట్రస్టు నిర్వాహకులను అభినందించారు. అనంతరం కలెక్టర్‌ను శాలువాతో వారు సత్కరించారు.

జగద్గురు పీఠం సేవలు ప్రశంసనీయం



తాటిచెట్లపాలెంలోని మాస్టర్ ఇ.కె. సంస్కృతి సదన్‌లో విదేశీ బృందం

తాటిచెట్లపాలెం: ది వరల్డ్ టీచర్ ట్రస్ట్(జగద్గురు పీఠం) సేవలు ప్రశంసనీయమని, ముఖ్యంగా దీనిని స్థాపించి దేశ విదేశాల్లో పీఠం సేవలను విస్తరింపజేసిన వ్యవస్థాపకుడు మాస్టర్ ఇ.కె., మాస్టర్ పార్వతీ కుమార్‌లు గొప్ప త్యాగధనులని పలువురు వక్తలు ప్రశంసించారు. తాటిచెట్లపాలెంలోని మాస్టర్ ఇ.కె. సంస్కృతి సదన్‌ను శుక్రవారం సుమారు 25 మంది విదేశీయులు సందర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో జగద్గురు పీఠం అధ్యక్షుడు డాక్టర్ కె.ఎస్.శాస్త్రి మాట్లాడుతూ ఈ ఇద్దరు మహనీయుల బోధనలు, గ్రంథాలు సాధకులకు మార్గదర్శకంగా నిలిచాయన్నారు. కులపతి బుక్ ట్రస్ట్ చైర్మన్ సిహెచ్.ఎస్.ఎన్.రాజు మాట్లాడుతూ మాస్టర్ ఇ.కె.పేరిట నిర్మించిన మాస్టర్ ఇ.కె.సుందరవనం, సంస్కృతి సదన్‌లు అనేక మంది సాధకులకు స్ఫూర్తినిస్తున్నాయన్నారు. సంస్థ డైరెక్టర్ చింతలపాటి సత్యదేవ్ మాట్లాడుతూ మాస్టర్ పార్వతీకుమార్ పవిత్రమైన సంకల్పానికి స్వరూపమే సంస్కృతి సదన్ అని తెలిపారు. ఇక్కడ టైలరింగ్‌లో శిక్షణ పొందిన సుమారు 20 మంది మహిళలకు జన శిక్షణ సంస్థాన్ చైర్మన్ సి.అచ్యుతరామరాజు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. స్విట్జర్లాండ్, జర్మనీ, స్పెయిన్ దేశాల నుంచి వచ్చిన ట్రస్ట్ ప్రతినిధులు సదన్ ప్రాంగణంలో ఫల, పుష్ప మొక్కలను నాటారు. కార్యక్రమంలో ధనిష్ఠ ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ కె.గురుప్రసాద్, జగద్గురు పీఠం భౌగోళిక కో ఆర్డినేటర్ లుడ్జర్, సంస్థ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య



సిరిగిడి దివ్య (ఫైల్)

సీతమ్మధార: భర్తతో గొడవ పడి మనస్తాపం చెంది ఓ వివాహిత ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన శుక్రవారం ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. తాటిచెట్లపాలెం శ్రీనివాస నగర్‌లోని సంతోషిమాత గుడి దరి నివసిస్తున్న సిరిగిడి దివ్య(22)కు చోడిశెట్టి కామేశ్‌తో 2021 మేలో ప్రేమ వివాహం జరిగింది. శుక్రవారం ఉదయం భర్తతో గొడవ జరగడంతో మనస్తాపం చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుంది. భర్త మధ్యాహ్నం భోజనానికి ఇంటికి వచ్చే తలుపులు కొట్టినా తీయకపోవడంతో వాటిని పగలుగొట్టి లోపలికి వెళ్లే చూసేసరికి.. దివ్య ఉరి వేసుకుని విగత జీవిగా కనిపించింది. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు సీఐ శ్రీనివాసరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

9న నివాస హక్కుల పోరాటంపై సదస్సు

సీతమ్మధార: ఈ నెల 9న నివాస హక్కుల పోరాట దినంపై డాబాగార్డెన్స్‌లోని అల్లూరి విజ్ఞాన కేంద్రంలో సదస్సును నిర్వహిస్తున్నట్లు మురికివాడ నివాసుల సంక్షేమ సంఘం, ప్రగతిశీల మహిళా సంఘం నాయకులు తెలిపారు. జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద శుక్రవారం పోస్టర్‌ను ఆవిష్కరించారు. కేంద్ర ఇంధన శాఖ పూర్వ కార్యదర్శి ఈఏఎస్ శర్మ ప్రారంభోపన్యాసం చేస్తారని పీవోడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.లక్ష్మి తెలిపారు.

హోరాహోరీగా పోటీలు



డిస్కస్‌త్రో చేస్తున్న కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ విద్యార్థిని



చెస్ ఫైనల్స్‌లో తలపడుతున్న విద్యార్థులు

మురళీనగర్: కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో నిర్వహిస్తున్న ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ గేమ్స్ పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. శుక్రవారం వెలువడిన ఫలితాల ప్రకారం బాల్‌బ్యాడ్మింటన్ విజేతగా సాయిగణపతి పాలిటెక్నిక్ కాలేజీ, షటిల్ బ్యాడ్మింటన్ డబుల్స్‌లో ఏవీఎన్ పాలిటెక్నిక్ కాలేజీ, టేబుల్ టెన్నిస్ సింగిల్స్‌లో ఏవీఎన్ కాలేజీ, టేబుల్ టెన్నిస్ డబుల్స్‌లో సాయిగణపతి పాలిటెక్నిక్ కాలేజీ, చెస్ పోటీల్లో కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీ(గైస్), 100 మీటర్స్ అథ్లెటిక్స్‌లో ఏవీఎన్ కాలేజీ, 400 మీటర్ల పరుగు పందెంలో ఏవీఎన్ కాలేజీ, 800 మీటర్ల ఈవెంట్‌లో పాడేరు జీఎంఆర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ, 1500 మీటర్ల ట్రాక్‌లో కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ, బ్రాడ్ జంప్‌లో ఏవీఎన్ పాలిటెక్నిక్ కాలేజీ, షాట్‌పుట్‌లో విశాఖపట్నం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలు విజేతలుగా నిలిచాయి.

విద్యార్థినుల సత్తా

బాలికల పోటీలకు సంబంధించి 100 మీటర్ల పరుగు పందెం, ఖోఖో, వాలీబాల్ పోటీల్లో భీమునిపట్నం ప్రభుత్వ బాలికల పాలిటెక్నిక్ కాలేజీ, షటిల్ బ్యాడ్మింటన్ సింగిల్స్, డబుల్స్ పోటీల్లో కొింకోటలోని రాజీవ్‌గాంధీ ఆర్‌ఈసీఎస్ పాలిటెక్నిక్ కాలేజీ, టేబుల్ టెన్నిస్ సింగిల్స్, డబుల్స్‌లో సాయిగణపతి కాలేజీ, చెస్, 800 మీటర్ల పరుగు, డిస్కస్ త్రోలో విశాఖపట్నం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ, షాట్‌పుట్‌లో ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీ, బ్రాడ్ జంప్‌లో సాయిగణపతి కాలేజీల బాలికలు విజేతలుగా నిలిచారు.

బ్యాంకు మహిళా ఉద్యోగుల సదస్సు రేపు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బ్యాంకు ఉద్యోగుల సంఘ ప్రతినిధులు

సీతంపేట: ఆంధ్ర, తెలంగాణ బ్యాంకు ఉద్యోగుల సమాఖ్య ఆధ్వర్యంలో ఈ నెల 8న హైదరాబాద్ కాచిగూడలో 6వ బ్యాంకు మహిళా ఉద్యోగుల సదస్సు జరగనుందని సంఘ నాయకుడు ఆర్.వి.రవికుమార్ తెలిపారు. శాంతిపురంలోని కెనరా బ్యాంకులో శుక్రవారం కార్యక్రమ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సదస్సుకు రెండు రాష్ట్రాల నుంచి వెయ్యి మంది మహిళా ఉద్యోగులు పాల్గొంటారని తెలిపారు. వారి సమస్యలు, హక్కులు, బ్యాంకింగ్ రంగంలో రాబోయే మార్పులు, ఎదుర్కోడానికి చేపట్టే చర్యలపై చర్చిస్తారని చెప్పారు. సమన్వయ సంఘ నాయకులు ఎ.యుగంధర్, ఎం.ఎస్.కుమార్, వి.రమేష్, కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.

44వ వార్డులో నిరంతర నీటి సరఫరా

పైప్‌లైన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ బానాల శ్రీనివాసరావు

సీతంపేట: జీవీఎంసీ 44వ వార్డు ప్రజల తాగునీటి కొరత తీరనుంది. వార్డులో ఇంటింటికీ 24/7 నిరంతర నీటి సరఫరా కోసం ప్రత్యేక పైప్‌లైన్ నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. దీనికి సంబంధించి శ్రీనివాసనగర్‌లో శుక్రవారం ముఖ్య అతిథి జీవీఎంసీ ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్ బానాల శ్రీనివాసరావు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 44వ వార్డులోని కొన్ని ప్రాంతాల్లో భూగర్భ జలాలు అడుగంటడంతో వేసవిలో నీటి ఎద్దడి సమస్య కొన్నేళ్లుగా వేధిస్తోందన్నారు. దీనిని పరిష్కరించాలని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లగా.. అక్కయ్యపాలెం మహారాణి పార్లర్ 80 ఫీట్ రోడ్‌కు ఇరువైపులా ఉన్న ప్రాంతాలకు 24/7 నిరంతర నీటి సరఫరాకు అనుమతి లభించిందని చెప్పారు. దీంతో 44వ వార్డులోని అన్ని ప్రాంతాలకు 24/7 నిరంతర నీటి సరఫరా అందుబాటులోకి వస్తుందన్నారు. 43వ వార్డు శ్రీనివాసనగర్‌కు 24/7 నిరంతర నీటి సరఫరా సదుపాయం లభిస్తుందన్నారు. నాణ్యతా ప్రమాణాలతో పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను బానాల ఆదేశించారు. కార్యక్రమంలో ఏఈ ఈశ్వర్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రెహమాన్, ఎన్‌సీసీ ప్రాజెక్టు మేనేజర్ రంగారావు, ఎన్‌సీసీ స్టాఫ్, స్థానిక నాయకులు హబీబ్, సీతారామ్, కృష్ణవేణి, రెడ్డి, సత్తిబాబు, గోపి, రాంబాబు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సహకారంతోనే దోమల నిర్మూలన



శ్రీనివాసనగర్‌లో ర్యాలీ చేస్తున్న ఫ్లోర్ లీడర్ బానాల శ్రీనివాసరావు, జీవీఎంసీ సిబ్బంది



సీతంపేటలో దోమ లార్వాలను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్

సీతంపేట: ప్రజల సహకారంతోనే దోమల నిర్మూలన సాధ్యమని జీవీఎంసీ ఫ్లోర్ లీడర్, 44వ వార్డు కార్పొరేటర్ బానాల శ్రీనివాసరావు అన్నారు. జీవీఎంసీ మలేరియా విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం శ్రీనివాసనగర్‌లో నిర్వహించిన ఫ్రైడే–డ్రైడే అవగాహన ర్యాలీలో ఆయన మాట్లాడారు. డెంగ్యూ, మలేరియా జ్వరాలకు కారణమవుతున్న దోమల పెరుగుదలను అరికట్టాలని సిబ్బందిని ఆదేశించారు. ప్రజలంతా వారానికి ఒక రోజు డ్రైడే పాటించి గోళాలు, కుండీలు, డ్రమ్ములు, ట్యాంకుల్లో నిల్వ చేసిని నీటిని పారబోసి మళ్లీ పట్టుకోవాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు హబీబ్, ప్రసాద్, సీతారామ్, మహదాస్యం గోపి, తాజ్, రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

25వ వార్డులో..

జిల్లా మలేరియా విభాగం ఆధ్వర్యంలో 25వ వార్డు సీతంపేటలో ఫ్రైడే–డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ మెంబర్, కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ సిబ్బందితో కలిసి దోమలు పెరిగే ప్రదేశాలు, వాటి నియంత్రణ చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్లు కె.శ్రీనివాసరెడ్డి, పి.శేషుబాబు, సచివాలయ హెల్త్ సెక్రటరీ మేరీ గ్రేస్, ఆశ వర్కర్ త్రివేణి, జీవీఎంసీ హెల్త్ వర్కర్ సుధాకర్ పాల్గొన్నారు.